ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం 22 జులై 2025





పేదోళ్ల కలలు సాకారం చేస్తాం

చెల్పూరు సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

- అప్పులు ఎన్ని ఉన్నా హామీలు నెరవేరుస్తున్నాం
- ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాల అమలు
- మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం
- దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో అభ్యున్నతి
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- భూపాలపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

గణపురం/ భూపాలపల్లిటౌన్/రేగొండ, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ఎన్ని అప్పులున్నా ఇచ్చిన మాటకు కట్టుబడి పేదోళ్ల కలలను నెరవేరుస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో వారు సోమవారం పర్యటించారు. కొత్తపగోరి, గణపురం మండలంలోని చెల్పూరు, భూపాలపల్లి పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. గణపురం మండలం చెల్పూరులో బస్టాండు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. భూపాలపల్లి పట్టణంలో జిల్లా గ్రంథాలయ భవనాన్ని, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కార్యాలయాన్ని ప్రారంభించారు. భాస్కరగడ్డ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు పట్టాలు పంపిణీ చేసి, గృహ ప్రవేశం చేయించారు. కొత్తపల్లిగోరి చెల్పూరు, భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి లక్షలాది మంది మహిళలను లక్షాధికారులను చేసేందుకు కృషి చేశారని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకున్న నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారని కొనియాడారు. మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్నారని అన్నారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఆర్టీసీ బస్సులు, సోలార్ పవర్ కేంద్రాలు, పెట్రోల్ బంక్‌లు, ధాన్యం సేకరణ కేంద్రాలు, మహిళా క్యాంటీన్లు, అమ్మ ఆదర్శ పాఠశాలలు లాంటి కార్యక్రమాలను చేపడుతూ మహిళల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు.

అప్పులు ఎన్ని ఉన్నా హామీలు నెరవేరుస్తున్నాం...

గత ప్రభుత్వం చేసిన రూ. 8లక్షల కోట్ల అప్పు ఉన్నప్పటికీ పది నెలల్లో రూ. 21వేల కోట్లు రుణ మాఫీ చేశామని మంత్రి పొంగులేటి అన్నారు. రైతు భరోసా డబ్బును తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు జమ చేశామని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్ సిలండర్, ఆరోగ్యశ్రీ కింద పేదల వైద్యం కోసం రూ. 10 లక్షలు ఇస్తున్నామని తెలిపారు. 5 లక్షల నూతన రేషన్‌కార్డులతో పాటు 16లక్షల కొత్త పేర్లను పాత కార్డుల్లో నమోదు చేసినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల ఇస్తున్నామని, భూపాలపల్లి నియోజకవర్గంలో మొదటి విడతలో 3,500 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో అదనంగా 1,500 ఇళ్లు ఇసున్నామని తెలిపారు. అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులను లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి ఎన్ని అప్పులున్నా... ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు.



భూపాలపల్లిలో గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే



సభలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అభివృద్ధి, సంక్షేమం మాకు రెండు కళ్లు

- పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రెండు కళ్లుగా భావించి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు తిరిగేవారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం వచ్చాకే నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 15వేల రేషన్ కార్డుల్లో మార్పులు చేశామన్నారు. 5వేల నూతన రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. పేద విద్యార్థుల కోసం రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గణపురంలో 60 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేశామని, మహిళలకు మినీ ఇండస్ట్రీలు ఏర్పాటు చేయడం కోసం 20 ఎకరాలు కేటాయించినట్లు

(మిగతా 8వ పేజీలో)

నాణ్యమైన ఎరువులను అందించాలి

- ఇన్‌చార్జి డీఏవో బాపురావు



ఫర్టిలైజర్ దుకాణంలో వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి డీఏవో జాడి బాపురావు

కృష్ణకాలనీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని ఇన్‌చార్జి డీఏవో జాడి బాపురావు అన్నారు. భూపాలపల్లిలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. స్టాక్, విక్రయాల రికార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువులను విక్రయించా లన్నారు. నానో యూరియా గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దుకాణానికి వచ్చిన రైతులకు వాటి ప్రాముఖ్యతను వివరించాలన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, డీఏపీకి ప్రత్యామ్నాయంగా నానో డీఏపీ వాడితే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని తెలిపారు.

ట్రస్మా నూతన కార్యవర్గం ఎన్నిక



సంపత్‌రావు



కార్తీక్‌రావు

కాటారం, జూలై21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రికగ్నైజ్డ్ పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని వివేకానంద హైస్కూల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, అసోసియేట్ అధ్యక్షుడు ఆడెపు శ్యాం, కార్య నిర్వాహక కార్యదర్శి నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వీరమనేని సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జనగామ కార్తీక్‌రావు, ఉపాధ్యక్షురాలుగా బోడేటి మంజుల, కోశాధికారిగా జాటోత్ నవీన్ కుమార్, సహాయ కార్యదర్శిగా కుడుదుల రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డేనియల్ రాజు, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల అధ్యక్షులు అబ్బు కేశవరెడ్డి, కోరం సంజీవరెడ్డి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్ల రవి, ఖిలా వరంగల్ మండల అధ్యక్షుడు రవీందర్, పాఠశాలల ప్రతినిధులు వలుస వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్, రాజబాపు, పృథ్వీధర్‌రావు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని రాగిజావ

- గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ
- ఈ విద్యాసంవత్సరం నిలిచిన సరఫరా

మొగుళ్లపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలోని 69 జడ్పీహెచ్‌ఎస్, 363 యూపీఎస్, పీఎస్ ప్రభుత్వ పాఠశాలలు, ఆరు మోడల్ పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు మరింత పౌష్టికాహారం అందించేందుకు గత ఏడాది ప్రభుత్వం రాగిజావ పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు పీఎం పోషణ్ పథకం కింద గత విద్యా సంవత్సరం ముగింపు వరకురాగిజావ అందించారు. కానీ, ఈ విద్యాసంవత్సరం రాగిజావ పంపిణీని ప్రారంభించలేదు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నుంచి రాగిపిండి, బెల్లం ప్యాకెట్లు ఇంకా సర్కార్ బడులకు సరఫరా కాలేదని తెలుస్తోంది.

కాళేశ్వరంలో పెరిగిన గోదావరి



కాళేశ్వరం వద్ద గోదావరి

మహదేవపూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద సోమవారం గోదావరి పెరిగింది. ఎగువన మహారాష్ట్రలో వర్షాలు కురవడంతో ప్రాణహిత నదికి వరదనీరు చేరుతోంది. దీంతో త్రివేణి సంగమం వద్ద 6 మీటర్ల మేర గోదావరి ప్రవహిస్తోంది. రెండు రోజుల కంటే సోమవారం గోదావరి నీటిమట్టం పెరిగిందని అధికారులు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీకి మళ్లీ పెరుగుతున్న వరద

మహదేవపూర్ రూరల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం నెమ్మదిగా పెరుగుతోంది. వారం రోజులుగా బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 80వేల క్యూసెక్కులు ఉండగా సోమవారం 1.23 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. బ్యారేజీ వద్ద నీటిమట్టం 2.40 మీటర్లుగా నమోదైనట్టు అధికారులు తెలిపారు.

సమ్మక్క బ్యారేజీలోకి 1,15,070 క్యూసెక్కులు

కన్నాయిగూడెం జూలై 21(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండ లంలోని తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద, గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద సోమవారం గోదావరి స్వల్పంగా పెరిగింది. గురువారం వరకు సమ్మక్క సాగర్ బ్యారేజీని ఫ్రీ ఫ్లోగా ఉంచిన ఇరిగేషన్ అధికారులు శుక్రవారం నుంచి ఒక్కొక్క గేట్లు మూసుకుంటూ వస్తున్నారు. దీంతో బ్యారేజీలో నీటిమట్టం పెరుగుతోంది. ఆది వారం నుంచి గోదావరిలోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగి 91,300 క్యూసెక్కులకు చేరింది. సోమవారం సాయంత్రానికి 1,15,070 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో బ్యారేజీలోని 53 గేట్లను మూసి ఆరు గేట్ల ద్వారా 1,09,470 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.388 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద 78.90 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

కొనసాగుతున్న దేవాదుల పంపింగ్

మండలంలోని గుట్టలగంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి పంపింగ్ కొనసాగుతోంది. ఆదివారం వరకు ఫేజ్-2 నుంచి రెండు మోటార్లు, ఫేజ్-3 నుంచి రెండు మొత్తం నాలుగు మోటార్ల ద్వారా 1078 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోసిన అధికారులు సోమవారం ఫేజ్-3లో మరో రెండు మోటార్లను ఆన్ చేశారు. దీంతో ఫేజ్-2లో రెండు, ఫేజ్-3లో నాలుగు మొత్తం ఆరు మోటార్ల ద్వారా 1661 క్యూసెక్కుల నీటిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా భీం ఘనపూర్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నారు. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 79.10 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

వైద్యులు అందుబాటులో ఉండాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 8వ పేజీలో...

ప్లాట్ కొనిస్తేనే కాపురానికి తీసుకెళ్తాడంటా..

- అదనపు కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులు
- జనగామ జిల్లా షాపల్లిలో భర్త ఇంటి ఎదుట నిరసన
- బాధితురాలికి అండగా నిలిచిన స్థానికులు

7



షాపల్లిలో భర్త ఇంటి ముందు దీక్ష చేపట్టిన శ్రావణి

ములుగు జిల్లాకు నిధుల వరద

- రెండేళ్లలో సుమారు వెయ్యి కోట్ల నిధులు
- ప్రత్యేక చొరవ చూపుతున్న మంత్రి సీతక్క
- రూ. 556.1 కోట్ల ఆర్అండ్‌బీ నిధులు
- రూ. 301.47 కోట్లు పంచాయతీ రాజ్ శాఖ నిధులు
- రూ. 98 కోట్ల గిరిజన అభివృద్ధి శాఖ నిధులు



వివరాలు 7వ పేజీలో..

అన్నదాతల్లో చిగురించిన ఆశలు



నర్సింహులపేట మండలంలో కురిసిన వర్షాలకు నిగనిగలాడుతున్న పత్తి చేలు

- ఎట్టకేలకు పలకరించిన వరుణుడు
- మోస్తరు వర్షపాతం నమోదు..
- రోజంతా మేఘావృతమై వున్న వాతావరణం
- పత్తి, మొక్కజొన్న పంటలకు జీవం
- సాగు పనులకు మళ్లీ శ్రీకారం

హనుమకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు ప్రాంతాల్లో సోమవారం మోస్తరు వర్షాలు కురిసాయి. వర్షాలు ఆలస్యం కావడంతో ఆందోళనలో వున్న రైతులకు.. తాజా వాతావరణం ఉపశమనం కలిగిస్తోంది. ఈ నెల 27 వరకు వర్షాలు వున్నట్టు వాతావరణ శాఖ చెబుతుండటంతో ఖరీఫ్ సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. పత్తి, మొక్కజొన్న, పసుపు, పెసర పంటలు, పండ్లు, కూరగాయల తోటలకు ఈ వర్షాలు జీవం పోస్తున్నాయి. అయితే భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కూడా లేకపోవడం గమనార్హం.

హనుమకొండ జిల్లాలో సోమవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతమై ఉండి మధ్యాహ్నం మోస్తరు వర్షం పడింది. 15.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి, దామెర, ఆత్మకూరు మండలాల్లో మోస్తరు వర్షం పడగా, భీమదేవరపల్లి, వేలేరు, ధర్మసాగర్, ఐనవోలు, ఎల్కతుర్తి, కమలాపూర్ నడికూడ, పరకాల, శాయంపేట మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. రానున్న 24 గంటల్లో హనుమకొండ జిల్లాలోని కొన్ని మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయనీ వాతావరణ కేంద్రం తెలిపింది.

వరంగల్ జిల్లాలో...

వరంగల్ వ్యవసాయం (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో సోమవారం 33.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. మూడు గ్రామాల్లో భారీ వర్షం కురువగా తొమ్మిది గ్రామాల్లో సాధారణ వర్షం పడింది. మిగితా గ్రామాల్లో చిరు జల్లులు పడ్డాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో రైతులు వరి నార్లు పోసేందుకు సిద్ధమవుతున్నారు. వ్యయవసాయశాఖ అధికారుల అంచనా ప్రకారం ఇప్పటి వరకు సుమారు 3లక్షల 13 వేల ఎకరాల్లో పంట సాగు చేయాల్సి ఉండగా ప్రస్తుతానికి లక్షా నలభై వేల ఎకరాల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయి. నెల రోజులుగా వర్షాల కోసం ఎదురు చూసిన రైతులకు గత రెండు రోజలుగా కురుస్తున్న వర్షాలతో ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ సాగు పనులు ఊపందుకునేందుకు అవకాశాలు ఏర్పాడ్డాయి.

భూపాలపల్లి జిల్లాలో...

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని వివిధ మండలాల్లో సోమవారం మోస్తారు వర్షం కురిసింది. భూపాలపల్లి జిల్లా కేంద్రంతో పాటు కాటారం, గణపురం, రేగొండ మండలాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నపాటి చినుకులతో కూడిన వర్షం పడింది. ఈ మండలాలను కలుపుకొని 24.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

జనగామ జిల్లాలో...

జనగామ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలో సోమవారం పలు చోట్ల వర్షం కురిసింది. ఉదయం ఎండగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం ఒక్కసారిగా మబ్బులు కమ్మి చల్లబడిపోయింది. జిల్లా కేంద్రంలో గంట పాటు ముసురు వాన కురువగా అక్కడక్కడా వర్షం కురిసింది. జఫర్‌గడ్‌లో అత్యధికంగా 27.5 మి.మీ, కూనూరులో 19.5, పాలకుర్తిలో 14.5, రఘునాథపల్లిలో 13.0, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 12.0, తరిగొప్పులలో 11.8, చిలుపూరులో 10.0, జనగామలో 9.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

మానుకోట జిల్లాలో...

మహబూబాబాద్ అగ్రికల్చర్ (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణశాఖ ప్రకటించింది. భారీ వర్షాలు రానున్న నేపథ్యంలో జిల్లాను ఆరెంజ్ అలర్ట్‌గా వాతావరణశాఖ ప్రకటించడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో సోమవారం నుంచి ప్రత్యేక కంట్రోల్ రూం 7995074803 నంబర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

భారీ వర్షాలే కురియనున్న తరుణంలో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే ఈ సెల్ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించింది. గత సీజన్‌లో భారీ వర్షాలు కురి సి కేసముద్రం, తాళ్లపూసపల్లిలో రైల్వేట్రాక్ కింది నుంచి కంకరకొట్టుకు పో యి తీవ్ర అంతరాయం కలగడంతో పాటు జిల్లాలోని వివిధ మండలాల్లో వంతెనలు, రోడ్లు, చెరువు కట్టలు తెగిపోయాయి. ఆ ఘటనలు గుర్తుంచుకున్న జిల్లా యంత్రాంగం ముందుగానే

(మిగతా 8వ పేజీలో)

అక్రమంగా ఇసుక తవ్వకాలు

- పాకాల సరస్సును పరిరక్షించాలి
- పార్లమెంట్‌లో గళమెత్తిన ఎంపీ కావ్య



ఎంపీ కడియం కావ్య

హనుమకొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంపీ కడియం కావ్య సోమవారం పార్లమెంట్‌లో గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు, పాకాల సరస్సు, అభయారణ్యం పరిరక్షణ, ఎకోటూరిజం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నించారు. అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా పర్యావరణ అసమతుల్యత ఏర్పడే ప్రమాదం ఉందని కావ్య ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ గ్రీన్ ఇండియా మిషన్ మొక్కల పెంపకం ప్రాజెక్టు గురించి, పాకాల వన్య ప్రాణి సంరక్షణ కేంద్రం ఏర్పాటు గురించి అడిగారు. ఇటీవల ఎకోటూరిజం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై జాతీయ గ్రీన్ ఇండియా మిషన్ నిధుల విడుదల గురించి ప్రశ్నించారు.

కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సమాధానం ఇస్తూ గోదావరి నది తీరాల్లో అక్రమ ఇసుక తవ్వకాల వల్ల కలిగే నష్టాన్ని బేరీజు వేస్తున్నామన్నారు. జాతీయ గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా గోదావరి పరివాహక ప్రాంతా ల్లో చేపడుతున్న చర్యల గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం, ఇతర సాంకేతిక అంశాలను పరిగణలోకి తీసుకోవడం ద్వారా ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు తమ వైపు నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇసుక అక్రమ రవాణా కార్యకలాపాల నిరోధానికి 2016, 2020 సంవత్సరాల్లో పర్యావరణ శాఖ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. వరంగల్‌లో గ్రీన్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో సమగ్ర కార్యాచరణ అమలవుతుందన్నారు. మొక్కల పెం పకం, పచ్చదనం విస్తరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం నుండి ప్రణాళిక వివరాలు అందాల్సి ఉందని మంత్రి పేర్కొన్నారు.



మహబూబాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్

మత్స్యకారుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తాం

● ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

● జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్ రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు, మత్స్యకారుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి మత్స్య సంప ద యోజన పథకాన్ని తీసుకువచ్చినట్లు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సాయి కన్వెన్షన్ హాల్ లో సోమవారం మత్స్యకారులు, రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లాలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారని, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మత్స్యకారులు, చేపల రైతులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. గిరిజన, పేదల కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రధాని ఆవాస్ యోజన కింద ఇళ్లను మంజూరు చేసిందని చెప్పారు. అర్హులైన వారు ఈ పథకానికి ఆన్‌లైన్ ద్వార దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమీక్షలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, మత్స్య శాఖ జిల్లా అధికారి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కేడీసీలో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్ జూలై 21 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో 2025-26 సంవత్సరానికి గాను గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ, బీబీఏ కోర్సులలో 6 పోస్టులు, క్రాప్ ప్రొడక్షన్, డేటా సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఫిషరీస్, మైక్రోబయోలజీ, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీ ఉందన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో మాస్టర్ డిగ్రీ కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులుండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, స్లెట్, అర్హత కలిగిన వారికి ఎంపికల్లో ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూలై 24, సాయంత్రం 4 గంటల వరకు కళాశాల పనిదినాల్లో దరఖాస్తులను అందచేయాలని కోరారు. ఇతర వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రజనీలతను సంప్రదించాలని కోరారు.

నేడు జాబ్ మేళా

హనుమకొండ కలెక్టరేట్, జూలై21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు మంగళవారం వరంగల్ ములుగురోడ్‌లోని ఐటీఐ కళాశాలలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీమార్ట్ హనుమకొండ, నిర్మాణ్ ఆర్గనైజేషన్, హైదరాబాద్‌లో టెలీకాలర్స్, సీసీటీవీ మానిటరింగ్, హెచ్‌ఆర్, ఎగ్జిక్యూటీవ్ తదతర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 10 నుంచి 15 వేల వరకు వేతనం ఉంటుందని, అభ్యర్థులు 10వ తరగతి నుంచి డిగ్రీ చదివి 18 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఉద్యో గం కావాలనుకునే అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో ఉదయం 10:30 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 78936 60741, 78933 94393 నెంబర్లలో సంప్రదించాలని మల్లయ్య ప్రకటనలో పేర్కొన్నారు.

అభయారణ్యంలో మద్యం సేవించిన వారిపై కేసు

ఏటూరునాగారం రూరల్, జూలై21 (ఆంధ్రజ్యోతి): అభయారణ్యంలో మద్యం సేవించి ప్లాస్టిక్ వ్యర్థాలను పడేసిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు దక్షిణ విభాగపు ఎఫ్ఆర్వో అబ్దుల్ రహ్మాన్ సోమవారం తెలిపారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని ఏటూరునాగారం- చిన్నబోయినపల్లి అభయారణ్యంలో 8 మంది వ్యక్తులు మద్యం సేవించి ప్లాస్టిక్ వస్తువులను అక్కడే పడేశారని పేర్కొన్నారు. వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని, రూ. 9వేల జరిమానా విధించామని చెప్పారు. ఎవరూ కూడా అభయారణ్యంలో జంతువులకు హాని కలిగేలా వ్యవహరించొద్దన్నారు. ప్లాస్టిక్ వస్తువులను అడవిలో పడేయకూడదని ఎఫ్ఆర్వో పేర్కొన్నారు.

మంట కలుస్తున్న మానవత్వం

● ఆస్తి కోసం రక్త సంబంధికుల హత్యలు
● సాక లేక తల్లిదండ్రులను వదిలేస్తున్న కుమారులు
● ఆడపిల్లలను కడుపులోనే చంపుతున్న కసాయిలు
● మార్పు తీసుకురావాలంటున్న ప్రజలు

మహబూబాబాద్ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మానవత్వం మంట కలుస్తోంది.. ఒకప్పుడు పెద్దలు, తల్లిదండ్రులు అంటే గౌరవం ఉండేది. ఒక్క తల్లి కడుపులో పుట్టిన అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు ఎంతో ప్రేమ, ఆప్యాయతతో ఉండేవారు. ఒకరినొకరు గౌరవించుకుంటూ, ఆప్యాయంగా పలకరిస్తూ ప్రాణమున్నంత వరకు కలిసిమెలసి జీవించేవారు. సాంకేతిక అభివృద్ధి చెందిన ప్రస్తుత సమాజంలో బంధాలు, బంధుత్వాలకు ప్రాధాన్యం లేకుండా పోయి అవి కనుమరుగవుతున్నాయి. మానవుల్లో స్వార్థం పెరిగి డబ్బు, ఆస్తి కోసం రక్త సంబంధికులు, కన్నపేగు మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. అవి హత్యల వరకు దారి తీస్తున్నాయి. అలాంటి ఘటనలు రోజుకొకటి చూడాల్సి వస్తోంది. సభ్య సమాజం తలదించుకునేలా సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తల్లిదండ్రులు సంపాందించిన ఆస్తి కోసం ఒక్క కడుపులో పుట్టిన అన్నదమ్ముల మధ్య ఘర్షణలు చోటు చేసుకోవడమే కాదు.. చంపుకుంటున్న ఘటనలూ చూస్తున్నాం. నవ మాసాలు మోసి పేగు తెంచుకుని జన్మించిన కుమారులు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను సాకలేక భారంగా భావిస్తూ అనాథాశ్రమంలో వదిలేస్తున్నారు. మరో అడుగు ముందుకేసి కర్కశంగా రోడ్డుపైన వదిలేస్తున్నారు. తాము భర్త అడుగులో అడుగు వేస్తూ జీవిస్తానని వేద మంత్రోచ్ఛరణల నడుమ తాళి కట్టించుకున్న భార్య ఇతరుల మాయ మాటలు విని భర్తలను కడతేరుస్తున్నారు. మరో పక్క ప్రేమకు అడ్డొస్తున్నారని యువత తల్లిదండ్రులను పొట్టన పెట్టుకుంటున్నారు. సమాజంలో రోజురోజుకు ఇలాంటి ఘటనలు పెరిగి పోతున్నాయి. స్వచ్ఛంద సంస్థలు, అధికారులు ముందుకు వచ్చి ప్రజల్లో చైతన్యం కల్పించి ఇలాంటి వాటికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.



మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం భూపతిపేట రైతు వేదిక వద్ద తల్లిని వదిలేసిన కుమారులు (ఫైల్)

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై ఒంటరిగా ..

జగమంతా కుటుంబం నాది... ఏకాకి జీవితం నాది.. అని ఓ సినీ గేయ రచయిత రాసిన పాట చందంగా ప్రస్తుత సమాజంలో అందరు ఉన్నా ఎవరు లేని వారిగా ఒంటరిగా జీవిస్తున్నారు. ఒకప్పుడు పల్లెల్లో ఉమ్మడి కుటుంబాలు కళకళలాడేవి. ప్రస్తుతం విద్యా, ఉద్యోగ, జీవనోపాధి, ఇతరత్రా కారణాలతో పట్టణాలకు వలస బాట పట్టడంతో ఉమ్మడి కుటుంబాలు తగ్గి ఒంటరిగా గడపాల్సి వస్తోంది. ఉమ్మడి కుటుంబంలో చిన్నారులకు పెద్దలు తమ అనుభవాలు, కథలను చెబుతూ సరియైన దారిలో నడిపించే వారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోయి మనుషుల మధ్య బంధాలు తెగిపోతున్నాయి. ఒక్క ఇంట్లో ఉన్న నలుగురు వ్యక్తులే ఎవరి సెల్‌ఫోన్‌లో వారు నిమగ్నమవుతున్నారు. కనీసం వారైన తమ అనుభవనాలను పంచుకునే పరిస్థితి లేకుండా పోతుంది.

సభ్య సమాజం తల దించుకునేలా ఘటనలు

తల్లిదండ్రులు కడుపు కట్టుకుని ఎంతో కష్టపడి ఆస్తిని కూడబెడితే దానిని పంచుకునే విషయంలో అన్నదమ్ముల ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. అంతటితో ఆగడం లేదు.. తమ బంధాలను మర్చిపోయి ఆస్తి విషయంలో సొంత తమ్ముళ్లు అన్నను హత్య చేశారు. ఈ ఘటన ఇటీవల కాలంలో మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇక నవమాసాలు మోసి కని పెంచి ప్రయోజకులని చేసి తాను సంపాందించిన ఆస్తి కుమారులకు కట్ట బెడితే చివరికి వృద్ధాప్యంలో ఆ తల్లిదండ్రులు వారికి భారంగా మారుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు వృద్ధాశ్రమంలో వదిలేస్తే.. మరి కొంత మంది మానవత్వాన్ని మరిచి రోడ్డుపైన వదిలేసిన సంఘటనలు చూస్తున్నాం. ఇలాంటి ఘటన జిల్లాలోని గూడురు మండలం భూపతిపేటలో చోటు చేసుకుంది. ముగ్గురు కుమారులు కలిసి తల్లిని రైతు వేదిక వద్ద వదిలేసిన హృదయ విదారకర ఘటనను చూశాం. మరో పక్క ప్రేమకు అడ్డు వస్తున్నారని పెద్దలను కడతేరుస్తున్న పిల్లలను చూస్తున్నాం.

ఇటీవల జిల్లాలోని ఇనుగుర్తికి చెందిన ఓ యువతి హైదరాబాద్‌లో ప్రియుడితో కలిసి తల్లిని హతమార్చిన ఘటన చోటు చేసుకుంది. కడదాకా నీవెంట నడుస్తానని ఏడడుగులు వేసి తాళి కట్టించుకున్న భార్య పరాయివాళ్ల మాయ మాటల్లో పడి వారితో కలిసి భర్తను హత్య చేస్తున్నారు. ఇక వివాహం జరిగి కాళ్ల పారాణి ఆరక ముందే వరకట్న వేధింపులకు నవ వధువులు బలైపోతున్నారు. మరో పక్క ఆడపిల్ల అని తెలవగానే కడుపులోనే చంపేస్తున్నారు. అలా కాకుంటే జన్మనిచ్చాక ఆ ఆడ శిశువును రోడ్లపై వదిలేస్తున్నారు. ఇంతటి ఘాతుకాలకు ఒడి గడుతున్న వారికి కఠిన శిక్షలు వేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసి సమాజంలో మార్పును తీసుకురావాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రజల మానసిక స్థితి మారాలి

ప్రజల మానసిక స్థితిలో మార్పు రావాలి. ప్రపంచంలో పెరిగిన సాంకేతికత ప్రభావం మానవులపై పడుతోంది. అందులో మంచిని స్వీకరించి చెడును వదిలేయాలి. కానీ చెడుకు ఎక్కువగా ప్రభావితం అవుతున్నారు. దీనికి తోడు ప్రతి ఒక్కరికి డబ్బుపై వ్యామోహం, ఆశ పెరగడంతో సులువుగా డబ్బు సంపాందించాలనే ఆలోచనలో పడి అన్నదమ్ములు, తల్లిదండ్రులతో ఆస్తి తగాదాలు చోటు చేసుకుని ఘర్షణలకు దారి తీస్తుంది. ఆడపిల్ల పుడితే వారి కి కట్న కానుకలు ఇవ్వాలని, వంశోద్ధారకు డు జన్మించాలనే దురాలోచనలతో ఆడ పిల్లలను కడుపులో చంపుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.



- సీనియర్ ఫిజీషియన్,
ఐఎంఏ అధ్యక్షుడు, మానుకోట

కుళ్లిన స్థితిలో గుర్తు తెలియని మృతదేహం

గణపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యమైన ఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో చోటు చేసుకుంది. సోమవారం మండల కేంద్రంలోని గణపసముద్రం శివారులో కొందరు స్థానికులు దుర్వాసన రావడాన్ని గమనించారు. పరిసరాలను గమనించగా అక్కడ కుళ్లిన స్థితిలో మృతదేహం కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అశోక్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం సుమారు 35ఏళ్ల యువకుడిదని, మృతదేహం మొత్తం కుళ్లి పోయిన స్థితిలో ఉందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటికి ఎందుకు లేటొచ్చావని అడిగినందుకు..

● మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



సర్వేశ్వర్‌రావు (ఫైల్)

తొర్రూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం తొర్రూరు పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ కేంద్రానికి చెందిన టి.సర్వేశ్వర్ రావు(42) గత రాత్రి మద్యం సేవించి ఇంటికి ఆలస్యంగా రావడంతో భార్య ఆలస్యం ఎందుకు అయిందని ప్రశ్నించడంతో మనస్తాపానికి గురై ఇంట్లోనే వేరే గదిలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందాడు. గతంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవని తెలుస్తుంది. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

కాళేశ్వరంలో భక్తుల సందడి

మహదేవపూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఆషాడమాసం చివరి సోమవారం, ఏకాదశి సందర్భంగా భక్తజనం పోటెత్తారు. గోదావరికి జలకళ ఉండటంతో భక్తులు ముందుగా గోదావరిలో బోటు షికారు చేసి పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బిల్వ పత్రాలతో అభిషేకాలు చేశారు. అనంతరం శుభానందదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గోదావరిలో బోటు వద్ద భక్తులు

గుండ్లవాగు ప్రాజెక్టులో మృతదేహం లభ్యం

గోవిందరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని గుండ్లవాగు ప్రాజెక్టులో మునిగి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైనట్లు పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు. స్థానికుల ద్వారా మృతుడి విషయం వెలుగులోకి రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించినట్లు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ఏనుమాముల గ్రామానికి చెందిన ఈసంపల్లి మణికుమార్(26) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడని అన్నారు. గత గురువారం ఉదయం ఆయనను తండ్రి స్వామి ఏ పని చేయకుండా తిరుగుతూ ఇంట్లోనే ఉంటున్నావు, అప్పులెలా తీరుస్తావు, చెల్లి పెళ్లి ఎలా చేస్తావని మందలించగా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగిందని అన్నారు. అనంతరం స్నేహితుడి ఫంక్షన్‌కు వెళతానని ఇంట్లో చెప్పి వెళ్లిన మణికుమార్ తిరిగి రాలేదు. శనివారం తన చెల్లెలు రాణికి ఫోన్‌చేసి నాకు బతకాలని లేదు, నేను చనిపోతున్నా, అందరూ మంచిగా ఉండండి అని చెప్పడంతోపాటు స్నేహితులకు కూడా అదే సందేశం చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడని అన్నారు. కుటుంబ సభ్యులు మణికుమార్ ఆచూకీ కోసం వెతుకుతుండగా సోమవారం ఉదయం పస్రా శివారులోని గుండ్లవాగు ప్రాజెక్టులో గుర్తుతెలియని శవాన్ని చూసి గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారని తెలిపారు.



మణికుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దీంతో కుటుంబసభ్యులు సంఘటన ప్రాంతానికి చేరుకుని తమ కుమారుడు మణి కుమారేనని గుర్తించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా వైద్యశాలకు తరలించామని ఎస్సై వివరించారు.

హాస్టల్ నుంచి పారిపోయిన బాలిక

తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్సై

గంట వ్యవధిలో బాలిక ఆచూకీ లభ్యం

నెక్కొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్ నుంచి పారిపోయిన విషయమై ఫిర్యాదు రావడంతో ఒక గంట వ్యవధిలో బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన సోమవారం నెక్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహ బూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బాలిక నెక్కొండలోని తెలంగాణ బాలికల గురు కుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. హాస్టల్ లో ఉండడం ఇష్టంలేని బాలిక సోమవారం సాయంత్రం 4.30 గంటలకు హాస్టల్ నుంచి పారిపోయింది. బాలిక హాస్టల్‌లో కనిపించకపోవడంతో సాయంత్రం 6.30 గంటలకు పోలీసులకు తెలిపారు.

పోలీసులు మూడు బృందాలుగా బాలిక ఆచూకీ కోసం గాలించారు. బాలిక తన ఇంటికి వెళ్లే క్రమంలో వర్షం వస్తుండడంతో మండలంలోని అంకానిపేట గ్రామంలోని బస్టాండ్‌లో ఉన్న విషయాన్ని గుర్తించిన ఎస్సై బాలికను అదుపులోకి తీసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల సమక్ష్యంలో అక్షితను తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్సై మహేందర్‌కు బాలిక తల్లిదండ్రులు, తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి కృతజ్ఞతలు తెలిపారు.

భార్యతో గొడవ పడి ఇంటికి నిప్పు

● రూ. 5లక్షల ఆస్తి నష్టం

గార్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ సోమవారం భార్యతో గొడవపడి భర్త ఇంటికి నిప్పుపెట్టిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేద్కర్ నగర్‌లో నివాసం ఉండే మూడ్ శ్రీను పోలీస్ ఉద్యోగం చేస్తూ రిమోల్‌పర్ సర్వీస్ అయ్యాడు. భార్య, ఇద్దరు పిల్లలతో ఇక్కడ నివాసం ఉంటున్నాడు. శ్రీనుకు ఇటీవల పక్షవాతం రావడంతో మానసిక పరిస్థితి క్షీణించింది. దీంతో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భార్యపై కోపంతో శ్రీను ఇంట్లో తలుపులు మూసి వేసి పెట్రోల్ పోసి ఇంట్లోని వస్తువులకు నిప్పు పెట్టడంతో గృహ పరికరాలు పూర్తిగా దహనమయ్యాయి. గ్రామస్థుల సమాచారం మేరకు డోర్నకల్ నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పి వేసింది. దీనిపై గార్ల ఎస్సైను వివరణ కోరగా కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



దహనమైన గృహోపకరాలు

చేయూత పింఛన్లు మంజూరు చేయాలి

కేసముద్రం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : నూతన చేయూత పింఛన్లు మంజూరు చేయాలనే డిమాండ్‌తో ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో కేసముద్రం పూలే సెంటర్‌లో సోమవారం పింఛన్ దరఖాస్తుదారులు నిరాహారదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒకటైన నూతన పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని కోరారు. పింఛన్‌కు అర్హులు దరఖాస్తు చేసుకొని మంజూరు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వెంటనే కొత్త పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్, బోడ వీరన్న, నేరడ వీరస్వామి, నారబోయిన రాజు, నాగేంద్ర, బుచ్చమ్మ, పందుల ఎల్లమ్మ, వల్లందాసు పుష్ప, వి.ఊర్మిళ, కె.పద్మ, వి.భాగ్యలక్ష్మి, పూల్మమ్మ, భూలక్ష్మి, అనసూర్య పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదం

లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

తొర్రూరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మం డలం మాటేడు గ్రామ శివారు ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ మాటేడు గ్రామ శివారులో ముందు వెళ్తున్న ఓ ట్రాలీ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాలీపల్టీ కొట్టి రోడ్డుపై పడడంతో తప్పించబోగా ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్తున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఖమ్మం నుంచి వరంగల్‌వైపు వస్తున్న పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌కు చెందిన లారీ డ్రైవర్ సోహన్ సింగ్‌కు రెండు కాళ్లు విరగడంతో 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రెండు వాహనాలకు ప్రమాదం చేసిన మధ్యప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ కమలేంద్ర యాదవ్ పరారీలో ఉన్న సమాచారం.



మాటేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఢీకొన్న లారీలు

ఈ ప్రమాదంలో ఇరువైపుల వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో లారీ ఇంజన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ సోహన్‌సింగ్‌ను బయటకు తీసి, వాహనాలను పక్కకు తీయడానికి తొర్రూరు, దంతాలపల్లి పోలీసులు గంట పాటు శ్రమించారు. ఈ విషయంపై తొర్రూరు ఎస్సై ఉపేందర్‌ను వివరణ కోరగా మహ్మద్ ఆరిఫ్ ఫిర్యాదు మేరకు కమలేంద్ర యాదవ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆస్పత్రిలో వృద్ధురాలి మృతి

సిబ్బంది నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

చిట్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అస్వస్థతకు గురైన వృద్ధురాలు చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఆమె మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హనుమకొండ కమలాపురం మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన పసునూటి శోభిత టేకుమట్ల మండలంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ అదే మండలం రామక్రిష్టాపూర్(టీ)లో నివాసం ఉంటున్నారు.

శోభిత అత్త పసునూటి సరోజన (60) ఆదివారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న అంబులెన్సు డ్రైవర్ రోగి ఇంటి వద్దకు వెళ్లకుండా కొంత దూరంలో వాహనాన్ని నిలిపివేశాడు. దీంతో ప్రైవేటు వాహనంలో అంబులెన్సు ఉన్న చోటికి ఆమె తరలించారు. అక్కడి నుంచి 108 వాహనంలో సరోజనను చిట్యాల సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సను అందిస్తుండగానే సరోజన మృతి చెందారు. 108 సిబ్బంది, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే సరోజన మృతి చెందిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతురాలి కుమారుడు కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.



చిట్యాల సామాజిక ఆస్పత్రిలో సరోజన మృతదేహం

చికిత్స అందిస్తుండగానే మృతి

ఆదివారం అర్ధరాత్రి సరోజనను ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే ఆమె పల్స్‌రేటు క్షీణించింది. ఆక్సిజన్ పెట్టి వైద్యం అందిస్తున్న క్రమంలో సరోజన మృతి చెందింది. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఏమీలేదు. ఆస్పత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించేందుకు మేము కృషిచేస్తాం.

- డాక్టర్ శ్రీకాంత్, ఆస్పత్రి సూపరింటెండెంట్

ములుగు జిల్లాకు నిధుల వరద

- రెండేళ్లలో సుమారు వెయ్యి కోట్ల నిధులు
- ప్రత్యేక చొరవ చూపుతున్న మంత్రి సీతక్క
- రూ. 556.1 కోట్ల ఆర్‌అండ్‌బీ నిధులు
- రూ. 301.47 కోట్లు పంచాయతీ రాజ్ శాఖ నిధులు
- రూ. 98 కోట్ల గిరిజన అభివృద్ధి శాఖ నిధులు

ములుగు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో వెనుక బడిన జిల్లాలో ఒకటైన ములుగు జిల్లా గత కొంత కాలంగా అభివృద్ధి పథంలో పయనిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారరంలోకి వచ్చినప్పటి నుంచి మంత్రి సీతక్క జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఇప్పటి వరకు సుమారు వెయ్యి కోట్లపైనే ఖర్చు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ నుంచి రూ. 301.47 కోట్ల నిధులు, రహదారులు, భవనముల శాఖ నుంచి 556.1 కోట్లు, గిరిజన అభివృద్ధి శాఖ నుంచి రూ. 98 కోట్లు వెచ్చించి పాఠశాలలు, అంగన్వాడి సెంటర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, ఇందిరా మహిళా శక్తి, కలెక్టరెట్ భవన సముదాయం, మేడారం అభివద్ధి పనులు వంటివి చేపట్టారు. అందులో కొన్ని పనులు పూర్తి కగా మరి కొన్ని పనులు కొనసాగుతున్నాయి.

పంచాయతీ రాజ్ శాఖ నిధులు

గత రెండు సంవత్సరాలలో రూ. 301.47 కోట్లతో జిల్లాలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాల, అంగన్వాడి సెంటర్లు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు పనులు ప్రారంభించారు. ఇందులో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వార రూ. 17.29 కోట్ల అంచనా వ్యయంతో 24 సీసీ రోడ్లు, 38 గ్రామ పంచాయతీ భవనాలు, 49 అంగన్వాడి కేంద్రాలు, 76 పాఠశాలల్లో మరుగుదొడ్ల పనులు చేపట్టారు.



ఇందిరమ్మ ఇంటి పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి సీతక్క (ఫైల్)

సీతఊఆర్ పథకం ద్వార రూ.73.98 కోట్లతో 37 రోడ్లు, ఎంఆర్ఆర్ పథకం ద్వార 109.76 కోట్లతో 62 రోడ్లను వేసేందుకు చర్యలు చేపట్టారు. ఎఫ్‌డీఆర్, ఎస్డీఆర్ పథకాల ద్వార రూ. 28.49 కోట్ల నిధులతో వివిధ రకాల పనులు చేపట్టారు. ఎస్ డీ ఎఫ్ గ్రాంటు కింద, ఎస్టీ కంపోనెంట్స్ లో రూ. 33.25 కోట్ల నిధులతో 10 రోడ్లను మంజూరు చేశారు. సీసీఆర్ గ్రాంట్ కింద రూ. 31.20 కోట్ల నిధులతో 666 ఇంటర్నల్ సీసీ రోడ్లు మంజూరు చేశారు. రూ. 5 కోట్లతో జిల్లా కేంద్రంలో ఇందిరా శక్తి భవనాన్ని నిర్మిస్తున్నారు. సీ ఎస్ ఆర్ నిధులు రూ. 2.50 కోట్ల నిధులతో జిల్లా కేంద్రంతో పాటు ఏటూరునాగారంలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో పలు పనులు పూర్తి కాగా మరి కొన్ని పనులు కొనసాగుతున్నాయి.

ఆర్ అండ్ బి నిధులు

జిల్లాలో పలు అభివృద్ధి పనుల కోసం రహదారులు, భవనాల శాఖ నుంచి రూ. 556.1 కోట్లు వెచ్చించి పలు పనులను చేపట్టారు. ఇందులో ఎస్టీ యస్ డీ ఎఫ్, ఆర్ డీ ఎఫ్ తదితర పథకాల ద్వార రూ. 492.60 కోట్ల నిధులతో 72 అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే రూ.63.50 కోట్ల నిధులతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని (కలెక్టరెట్) నిర్మిస్తున్నారు.

గిరిజన శాఖ నిధులు

ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో నిర్వహించిన మినీ మేడారం శ్రీ సమ్మక్క- సారల్మ జాతర కోసం రూ. 5.33 కోట్లు వెచ్చించి 69 పనులు పూర్తి చేశారు. ఎస్టీ, ఎస్డి ఎఫ్ పథకంలో భాగంగా గత రెండు సంవత్సరాలలో రూ. 68.51 కోట్లతో 52 రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇందులో 12 రోడ్లు పూర్తి కాగా మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయి. రూ. 5కోట్లతో 25 గ్రామ పంచాయతీ భవనాలు నిర్మిస్తున్నారు. ఇందులో 2 భవనాలు పూర్తి కాగా మిగినవి పురోగతిలో ఉన్నవి. ఏఎస్ఎస్‌టీ టూ ఐటీడీఏ లో భాగంగా 7.23 కోట్ల నిధులతో 110 పనులు చేపట్టారు. రూ. 11.65 కోట్లతో అంగన్వాడి సెంటర్లు, ఆశ్రమ పాఠశాలలు, సబ్ సెంటర్ల మరమ్మతులు చేపట్టారు. 2024లో జరిగిన మేడారం మహా జాతర కోసం రూ. 115 కోట్లు వెచ్చించారు. 2026 జనవరి 28నుంచి ప్రారంభం కానున్న మేడారం మహా జాతర కోసం శాశ్వత రోడ్లు నిర్మించేందుకు రూ. 33 కోట్లు వెచ్చించారు. ఇటీవల ములుగు జిల్లా కేంద్రంలో రూ.4.80 కోట్లతో అదునాతన బస్టాండ్ నిర్మాణం చేపట్టేందుకు భూమి పూజ చేశారు. అలాగే రూ. 6.28 కోట్లతో ఏటూరునాగారంలో బస్ డిపోను ఏర్పాటు చేయనున్నారు. రూ. 52 లక్షలతో మంగపేటలో బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలగవద్దని బుచ్చంపేట, అడవిరంగాపూర్, గట్టమ్మ, జగ్గన్నపేట, నార్లాపూర్, లింగాల, రొయ్యూరు గ్రామాలలో సబ్‌స్టేషన్‌లు ఏర్పాటుకు మంత్రి కృషి చేస్తున్నారు. ఇప్పటికే భూమి కొనుగోలు చేశారు. పనులు త్వరలో ప్రారంభించనున్నారు.

అక్షరాల అగ్నిధార దాశరథి

- తెలంగాణ అస్తిత్వపు భావాజాలాన్ని చాటిన సాహితీ యోధుడు
- నేడు శత జయంతి



చిన్నగూడూరులో2008లో ఏర్పాటు చేసిన దాశరథి కృష్ణమాచార్య విగ్రహం

చిన్నగూడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ నిజాం ఏలుబడిలో రజాకార్ల అరాచకాలను ఎదిరించిన అక్షరాల అగ్నిధార దాశరథి కృష్ణమాచార్య. తన అక్షరాలతో తెలంగాణలో విప్లవాగ్నిని రగిలించి, తెలంగాణ విముక్తి కోసం అలుపెరగని పోరాటంచేశారు. నిర్బంధించినా ప్రళయంలాంటి కవితలతో విరుచుకుపడ్డారు. ఆయనను జైలులో బంధించినప్పుడు జైలు గోడలపై నిజాంకు వ్యతిరేకంగా బొగ్గుతో కవితలు రాశారు. ఓ నిజాం పిశాచమా కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని తీగెలనుతెంపి అగ్నిలో దించినావు నాతెలంగాణ కోటి రత్నాల వీణ అని ఎలుగెత్తారు. తన రచనలతో తెలంగాణ అస్తిత్వపు భావజాలాన్ని నలుదిశలా చాటిన సాహితీ యోధుడు దాశరథి. అందుకే తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఓ ధ్రువతారలా నిలిచారు. నిజాం అరాచక పాలనలో మగ్గిపోతున్న తెలంగాణను తన కవిత్వంతో తట్టిలేపిన ప్రజాకవి. సినీరంగ ప్రవేశం చేసి అద్భుత గీతాలెన్నో రాసి, సినిమా పాటల పయోనిధిగానూ ప్రసిద్ధుడయ్యాడు.

తెలుగు సినిమా పాటలకు ఉర్దూపద సౌందర్యాన్ని అద్దిన ఘనతా ఆయనదే. ఆయనకు కళాప్రపూర్ణ బిరుదుతోపాటు 1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఆకాడమీ బహుమతి. 1974లో కేంద్ర సాహిత్య ఆకాడమీ బహుమతి, వెంకటేశ్వర యూనివర్సిటీ గౌరవ డి-లిట్‌ను అందుకున్నారు. దాశరథి కృష్ణమాచార్యులు 1925 జూలై 22న చిన్నగూడూరులో జన్మించారు. దాశరథి తన తండ్రి వెంకటాచార్య నుంచి సంస్కృతం, తల్లి వెంకటమ్మ నుంచి భాగవతం నేర్చుకున్నారు. కౌశవర్య శాస్త్రి వద్ద వేదాలు, ఉపనిషత్తులు నేర్చుకున్నారు. 15 ఏళ్ల వయస్సులో 25 పద్యాలను అవలీలగా చెప్పి అప్పటి సుబేదార్ నారాయణరావు ప్రశంసలు పొందారు. ఉపాధ్యాయుడిగా, పంచాయతీ ఇన్‌స్పెక్టర్‌గా, ఆకాశవాణిలో ఉద్యోగాలు చేశారు. 1961లో సినీరంగ ప్రవేశం చేసి వందలాది పాటలు రాశారు. కృష్ణమాచార్యులను అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఘనంగా సత్కరించారు. 1987 నవంబర్ 5వతేదిన ఆయన పరమపదించారు.

దాశరథి విగ్రహం ఏర్పాటు

మహబూబాబాద్ సమైక్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడు అడ్డగోడ నరేశ్ తన సొంత ఖర్చులతో చిన్నగూడూరులో 2008 నవంబర్ 30న విగ్రహం ఏర్పాటు చేసి ప్రజాకవి గద్దర్ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేశారు. దాశరథి శత జయంతి వేడుకలకు ఆయన స్వగ్రామం చిన్నగూడూరులోని దాశరథి ప్రాంగణం ముస్తాబవుతోంది. జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి దాశరథి ఉత్సవ కమిటీ, ఆయన అభిమానులు ఏర్పాట్లు చేస్తున్నారు.



గూడూరు మండలం భీమునిపాదంలో జాలువారుతున్న జలపాతం

భీమునిపాదంలో జలసవ్వడి

వర్షాలతో పెరిగిన జలపాత ఉధృతి

గూడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానాగారం శివారు కొమ్ములవంచ అటవీ ప్రాంతంలో పచ్చని ప్రకృతి నడుమ నిరంతర భీమునిపాదం జలపాతం ఉన్న విషయం తెలిసిందు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈ జలపాతం ఉధృతి స్వల్పంగా పెరిగింది. 70 అడుగుల ఎత్తు నుంచి జాలు వారుతున్న నీటిని చూసి పర్యాటకులు అబ్బురపడుతున్నారు. గలగలపారే సెలయేరు ఒక్కసారిగా మాయమై గుట్టపై నుంచి జాలువారుతుంటే చూసేందుకు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. ఈ జలపాతానికి రాష్ట్రంలో అరుదైన గుర్తింపు ఉంది. వృక్షసంపదతో పాటు రకరకాల పక్షులు కనువిందు చేస్తున్నాయి. ట్రెక్కింగ్, క్యాంపింగ్, అడ్వెంచర్ ఎకో టూరిజానికి అనువైన ప్రాంతంగా నిలుస్తోంది. ఈ దిశగా అటవీ, పర్యాటక శాఖలు చొరవ చూపి ఈ సౌకర్యాలను ఏర్పాటు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా పర్యాటకులు ఇక్కడకు వచ్చే అవకాశం ఉంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్‌రావు, రేంజ్ అధికారి సురేష్‌ల పర్యవేక్షణలో సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ప్లాట్ కొనిస్తేనే కాపురానికి తీసుకెళ్తాడంటా..

- అదనపు కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులు
- షాపల్లిలో భర్త ఇంటి ఎదుట నిరసన
- బాధితురాలు శ్రావణికి అండగా నిలిచిన స్థానికులు



షాపల్లిలో భర్త ఇంటి ముందు దీక్ష చేపట్టిన శ్రావణి

జఫర్‌గడ్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ప్లాట్ కొనివ్వాలని, అదనపు కట్నం తేవాలంటూ భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని, తనకు న్యాయం చేయాలని శివరాత్రి శ్రావణి తన భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. ఈఘటన సోమవారం జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం షాపల్లిలో చేసుకుంది. బాధితురాలు శ్రావణి కథనం ప్రకారం. రఘునాథ్‌పల్లి మండలం కుర్చపల్లికి చెందిన గుర్రంస్వామి -నీలమ్మ దంపతుల కుమార్తె శ్రావణిని, జఫర్‌గడ్ మండలం షాపల్లికి చెందిన శివరాత్రి లక్ష్మీ-వెంకటేశ్‌ల కుమారుడు శ్రీకాంత్‌తో 2023, జూన్‌లో వివాహమైంది. కట్నం కింద రూ.30లక్షలు ఇచ్చారు. శ్రీకాంత్ గ్రామాల్లో చిన్నచిన్న రోడ్డు కాంట్రాక్టులు చేస్తుంటాడు. రెండు నెలలు వీరి కాపురం సాఫీగానే సాగింది. ఆ తర్వాత గొడవలు ఆరంభమయ్యాయి. భర్త, అత్తమామలు అదనపు కట్నం తెమ్మని వేధింపులకు గురిచేస్తూ, ఏడాది క్రితం శ్రావణిని కొట్టి ఇంట్లో నుంచి గెంటేశారు. అప్పటి నుంచి ఆమె పుట్టింటిలోనే ఉంటోంది. కాపురానికి తీసుకెళ్లాలని పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టినా అతడిలో మార్పు రాలేదు. తాజాగా హైద్రాబాద్‌లో తనకు ప్లాట్ (స్థలం)కొనిస్తేనే కాపురానికి తీసుకువెళతానంటూ భర్త తేల్చి చెప్పాడు. ప్రస్తుతం భర్త, అత్తమామలు ఘట్‌కేసర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. భర్త శ్రీకాంత్ కూడా అక్కడే ఉంటున్నాడు. కాగా, సోమవారం శ్రావణి షాపల్లిలోని ఇంటికి కుటుంబ సభ్యులతో చేరుకుని ఆందోళన చేపట్టింది. ప్రస్తుతం ఇంటికి తాళం వేసి ఉండగా, అత్తింటివారు వచ్చిన తనను కాపురానికి తీసుకెళ్లే వరకు ఇక్కడే పోరాటం చేస్తానని శ్రావణి పేర్కొంటోంది. ఆమె ఆందోళనకు గ్రామస్థులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అమె అక్కడే వంట చేసుకుని నిరసన తెలిపింది.

పచ్చదనం పరిఢవిల్లేలా..

- జిల్లాలోని 337 నర్సరీల్లో 3 లక్షల మొక్కలు సిద్ధం
- వనమహోత్సవానికి అధికారుల ప్రణాళికలు
- జూలై 26 నుంచి ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు

నెక్కొండ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వనమహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందుకోసం జిల్లాలోని 337 నర్సరీల్లో 32,02,515 మొక్కలను పెంచుతున్నారు. ఈ వనమహోత్సవంలో 70 నుంచి 80 నకాలకు చెందిన 32 వేల మొక్కలు నాటేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలోని మండలాల అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. గ్రామ పంచాయతీల పరిధిల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా సంరక్షకులను నియమించి నీడనిచ్చే మొక్కలు మొదలు పూల, పండ్ల మొక్కలను పెంచారు. నాటిన ఒక్కో మొక్కకు రూ.150 ఖర్చుచేసి రెండేళ్ల వరకూ కాపాడనున్నారు. మొత్తం 26 ప్రభుత్వ శాఖలు పచ్చదనం పరిఢవిల్లేలా కృషిచేయనున్నాయి.

ఒక్కో నర్సరీకి రూ.1.40లక్షల ఖర్చు

ఉపాధిహామీ పథకంలో భాగంగా జిల్లాలోని 328 గ్రామ పంచాయతీల పరిధిలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. వీటితో పాటు అటవీ శాఖ రెండు, జీడబ్ల్యూఎంసీ నాలుగు, నర్సంపేట మునిసిపాలిటీ 7, వర్ధన్నపేట మునిసిపాలిటీలో ఒకటి చొప్పున నర్సరీలు నిర్వహిస్తున్నారు. ఒక్కో నర్సరీలో సుమారు 10 వేల మొక్కలు పెంచుతుండగా ఇందుకోసం నర్సరీకి దాదాపు రూ.1.40 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. కాగా మొక్కల సంరక్షణకు ప్రతీ రోజు రెండు సార్లు నీరుపోయడమే కాకుండా వాటిని ఎండ వేడిమి నుంచి కాపాడుటకు గ్రీన్ పట్టాలను ఏర్పాటు చేశారు. నర్సరీలను సంబంధితాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నిర్వహకులకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు ఇస్తున్నారు.



నెక్కొండ మండలంలోని ముదిగొండ, గుండ్రపల్లి గ్రామాల్లోని నర్సరీలో పెరిగిన మొక్కలు

ఇంటింటికి ఆరు రకాల మొక్కల పంపిణీకి ఏర్పాట్లు

వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటుటకు కార్యచరణ సిద్ధం చేశాం. ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యా సంస్థలో మొక్కలు నాటడంతో పాటు ప్రతీ ఇంటికి ఆరు రకాల మొక్కలు పంపిణీ చేయడానికి సిద్ధం చేశాం. నాటిన ప్రతీ మొక్కను రక్షించే బాధ్యత ఆయా కార్యాలయ అధికారులు, ఇంటి యాజమానులదే. పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వారి బాధ్యతను నిర్వహించాలి.

- డీఆర్‌డీవో కౌసల్యాదేవి



మొక్కలకు నీరు పోస్తున్న వాచర్



భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఎమ్మెల్యే వైఖరిపై జర్నలిస్టుల నిరసన

అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ర్యాలీ

భూపాలపల్లి టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వైఖరిపై జర్నలిస్టులు సోమవారం నిరసనకు దిగారు. తమపై ఎమ్మెల్యే అనుచితంగా వ్యాఖ్యలు చేశారంటూ ఆందోళన చేపట్టారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటనను బహిష్కరించారు. నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు చేతబూని ప్రెస్‌క్లబ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ తీసి బైఠాయించారు. మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు పర్యటన నేపథ్యంలో భూపాలపల్లిలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అనంతరం విలేకరులతో చిట్‌చాట్ చేశారు. ఈ క్రమంలో ఇద్దరు జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడుతూ ఒకరు తనను ఇసుక కావాలని అడిగారని, అలా పంపడం సాధ్యం కాదని తాను ఖరాకండిగా అన్నానని చెప్పారు. మరో జర్నలిస్టు తనపై అసత్య ఆరోపణలు చేస్తూ వార్తా కథనాలు రాస్తున్నారని అన్నారు. 'విలేకరులు ఏం రాసినా నాకేం కాదు.. నన్ను ఎవరేం పీ... లేరు' అని వ్యాఖ్యానించారు. దీనిపై భగ్గుమన్న జర్నలిస్టులు సోమవారం సమావేశమై ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించారు. మంత్రుల పర్యటనను బహిష్కరించి నిరసనకు దిగాలని నిర్ణయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు. జర్నలిస్టుల పట్ల అనుచితంగా మాట్లాడిన ఎమ్మెల్యే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు క్యాతం సతీష్‌కుమార్, మంథెన సమ్మయ్య, ఎర్రం సతీష్‌కుమార్, సారేశ్వర్‌రావు, తడక సుధాకర్, చెరుకు సుధాకర్, తాళ్లపల్లి సమ్మయ్య, సామంతుల శ్యామ్, సామల శ్రీనివాస్, ఎడ్ల సంతోష్, తిక్క ప్రవీణ్, రాంబాబు, ప్రవీణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో జరిగిన మంత్రుల సభకు రేగొండ జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.


నేను అనుచితంగా మాట్లాడలేదు..

తాను ఉద్దేశపూర్వంగా జర్నలిస్టులు ఎవరి పట్ల కూడా అనుచితంగా మాట్లాడలేదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. కొంత మంది విలేకరులు ఫోన్ చేసి సిమెంట్, ఇసుక పంపాలని అడిగారని మాత్రమే చిట్‌చాట్ సందర్భంగా చెప్పానని అన్నారు. వ్యక్తిగతంగా ఎవరిని కించపరిచే ఉద్దేశం తనకు లేదని అన్నారు.

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

వానాకాలం వరి నాట్లు షురూ

కాటారం, జూలై 21(ఆంధ్రజ్యోతి):మండలంలో వానకాలం వరి నాట్లు వేయడం ప్రారంభమైంది. గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బోరు బావులు, చెరువుల కింద నార్లు పోసిన రైతాంగం వ్యవసాయ పనుల్లో బిజీ అయింది. బోర్ల కింద రైతులు తమ పొలాలను ఒడ్లు చెక్కించి, కేజ్‌వీల్స్, రోటవేటర్‌తో దున్ని, జంబులు కొట్టి కూలీలతో వరి నాట్లు వేయిస్తున్నారు. సీజన్ ప్రారంభంలో వానలు సరిగా కురియకపోవడం, ఇటీవల వర్షాలు కురియడంతో కొంతమంది రైతులు నార్లు పోయకుండా కొద్దిగా మొలకెత్తిన వడ్లను వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారు. మండలంలో వానకాలం సీజన్‌లో సుమారు 13వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు కానుంది. స్వల్పకాలిక, మధ్యకాలిక రకాల వరి వంగడాలను నార్లుగా పోసుకున్న రైతులు నాట్లను మొదలుపెట్టారు. సిఫారస్ చేసిన మేర డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను ఆఖరి దుక్కిలోనే మొత్తం వేసుకొని కలియదున్ని నాట్లు వేసుకోవాలని, 48గంటల ముందే జింక్ సల్ఫేట్ వేసుకుని ఇతర జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో పూర్ణిమ సూచిస్తున్నారు.



నారు తీస్తున్న కూలీలు



నాట్లు వేస్తున్న కూలీలు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
మంగళవారం 22 జూలై 2025

నిధులు లేక.. విధులు భారం

- జీపీలో సరిగా సాగని చెత్త సేకరణ
- ట్రాక్టర్ల నిర్వహణకు డీజిల్ కొరత


డీజిల్ లేక నిరుపయోగంగా జీపీ ట్రాక్టరు

వాజేడు, జూలై 21(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రెండేళ్లుగా నిధులు రాకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా చెత్త సేకరణ, ఇతర పారిశుధ్య కార్యక్రమాలకు విఘాతం ఏర్పడింది. గత ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేకంగా ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లను కేటాయించి వాటి నిర్వహణను పంచాయతీలకు అప్పగించింది. ఏడాది పాటు సవ్యంగానే సాగిన ట్రాక్టర్ల నిర్వహణ నేడు భారంగా మారింది. కనీసం డీజిల్ పోయించేందుకు సైతం డబ్బులు లేకపోవడంతో ట్రాక్టర్లు పంచాయతీల్లోనే మూలుగుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ట్రాక్టర్ల వినియోగించే పరిస్థితి నెలకొంది.

మండల వ్యాప్తంగా 17 జీపీలు ఉండగా 17 జీపీలకు 17 ట్రాక్టరు అందుబాటులో ఉన్నాయి. వారంలో కనీసం రెండు రోజుల పాటు చెత్త సేకరణకు ఇళ్ల వద్దకు రావాల్సి ఉండగా నెలలో ఒక్కరోజు మాత్రమే ట్రాక్టర్లను తిప్పుతున్న పరిస్థితి నెలకొంది. జీపీలకు వచ్చే అరకొర నిధులు ట్రాక్టర్ల కిస్తీలకు, విద్యుత్ బకాయిలకు, జీపీ కార్మికుల జీతాలకు సరిపోతున్నాయని కార్యదర్శులు అంటున్నారు. ఒక్కో జీపీలో ట్రాక్టరు నిర్వహణకు నెలకు కనీసం రూ. 10వేలు ఖర్చు వస్తుందని, అందుకే వారానికి ఒక్కసారి మాత్రమే చెత్త సేకరణను చేపడుతున్నట్లు తెలిపారు.

పేరుకుపోతున్న చెత్తాచెదారం

పంచాయతీలకు చెత్త సేకరణ భారంగా మారింది. దీంతో పల్లెల్లో ఎక్కడి చెత్తాచెదారం ఎక్కడికక్కడే ఉంటోంది. అసలే వర్షాకాలం కావడంతో పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తూ రోగాలకు కారణమవుతున్నాయి. గ్రామాల్లో చెత్త సేకరణ, పారిశుధ్య లోపం కారణంగా పల్లెలు కంపు కొడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై బురద, మురికి గుంటలు ఉండటంతో నడిచేందుకు కూడా వీలు లేకుండా పోతోందని అంటున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాల్సిన బాధ్యత జీపీ, వైద్యసిబ్బంది పై ఉన్నప్పటికీ నిధుల కొరత కారణంగా జీపీలలో పారిశుధ్య పనులపై పట్టింపులేకుండా పోయిందనే విమర్శలు వస్తున్నాయి. పాడైన వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ నిధుల కొరతతో ఆ పనులు కూడా చేయని పరిస్థితి నెలకొంది. తమకు జీతాలు సైతం సక్రమంగా ఇవ్వడం లేదని కొందరు జీపీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమతో అన్ని పనులు చేయించుకుంటున్న అధికారులు జీతాల విషయంలో మాత్రం తాత్సారం చేస్తున్నారని అంటున్నారు.

కార్యదర్శులపై భారం

జీపీల నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు భారంగా మారిందని తెలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నెలవారి నిధులు రెండేళ్లుగా నిలిచిపోవడంతో తమ సొంత నగదు వెచ్చిస్తూ జీపీలలో పనులు చేయిస్తున్నట్లు కొంత మంది కార్యదర్శులు వాపోతున్నారు. ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో జీపీలో ఒక్కో కార్యదర్శి సుమారు రూ. 8లక్షల వరకు అప్పులు చేసి జీపీ బాధ్యతను చేపడుతున్నట్లు సమాచారం. నిధులు వస్తే అప్పులు తీరతాయని అనుకున్నప్పటికీ ఆ పరిస్థితి లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని ఆవేదన వ్యక్తమవుతోంది. అప్పులు తీసుకోవడంతో తమ సిబిల్ స్కోర్‌పై ప్రభావం పడుతోందని జీపీ కార్యదర్శులు అంటున్నారు. అదే విధంగా రానున్న ఎన్నికల భారం కూడా తమపై పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే జీపీలలో నిధులు లేవంటే ఎన్నికల ఖర్చులు ఎలా భరించాలని బెంబేలెత్తిపోతున్నారు. మంత్రి సీతక్క చొరవ తీసుకొని పంచాయతీలలో పేరుకుపోయిన బకాయిలను విడుదల చేయటంతో పాటు పారిశుధ్యాన్ని పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల పక్షాన పోరాడేది సీఐటీయూ మాత్రమే..

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

వాజేడు, జూలై 21(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల పక్షాన పోరాడేది సీఐటీయూ మాత్రమేనని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. మండలంలోని గుమ్మడిదొడ్డిలో పంచాయతీ కార్మికుల యూనియన్ సమావేశం సోమవారం జరగ్గా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తోందని విమర్శించారు. శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తోందని ఆరోపించారు. సమయపాలన లేకుండా జీపీ కార్మికులతో ఇష్టానుసారంగా పనులు చేయించుకుంటున్నారని దుయ్యబట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 29 రోజులు సమ్మె చేస్తే కార్మికుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ విధానాలనే అవలంబిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బల్లురి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం రాజేందర్, నాయకులు దావూద్, కొప్పుల రఘుపతిరావు, మల్లా రెడ్డి, కట్ల నర్సింహచారి, నీలాదేవి, సమ్మక్క, కొండయ్య తదితరులు పాల్గొన్నారు. మండలంలోని 17 జీపీలలో పనిచేస్తున్న 60 కార్మికులు భాస్కర్ సమక్షంలో సీఐటీయూలో చేరారు.

డంపింగ్ యార్డుగా కేన్ రక్షిత ప్రాంతం

వెంకటాపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి పాలంపేట గ్రామ శివారులోని కేన్ రక్షిత ప్రాంతం అధికారుల అలసత్వం, పర్యవేక్షణలోపంతో డంపింగ్ యార్డుగా మారుతోందని కేన్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ, వృక్షశాస్త్రవేత్త డాక్టర్ సుతారి సతీష్ అన్నారు. పరిశోధక బృందంతో కలిసి కేన్ రక్షిత ప్రాంతాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలు అవగాహన లోపంతో రాష్ట్రంలోనే అరుదైన, ఏకైక కేన్ మొక్కల రక్షిత ప్రాంతంలో వ్యర్థ పదార్థాలు, చెత్త వేస్తూ డంపింగ్‌యార్డుగా మార్చుతున్నారని, అధికారులు వెంటనే దృష్టిసారించి తగిన చర్యలు తీసుకుని కేన్ రక్షిత ప్రాంతాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా 51ఎకరాల కేన్ ప్రాంతంలో అటవీ సంబంధ దేశీయ మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వరదలపై ప్రజలను అప్రమత్తం చేయాలి: ఏఎస్పీ

వాజేడు, జూలై 21(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఆకస్మాత్తుగా వచ్చే వరదలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పోలీసు అధికారులకు సూచించారు. మండలంలోని పేరూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం సందర్శించారు. స్టేషన్ భద్రతపై పలు సూచనలు చేశారు. అదే విధంగా రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన టేకులగూడెం వద్ద తరుచూ నీట మునిగే రేగుమాగు వంతెనను ఆయన పరిశీలించారు. అనంతరం మాటాడుతూ యువతకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట వెంకటాపురం సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

తాడ్వాయి, జూలై 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ కోరారు. విలేకరులతో ఆయన సోమవారం మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మంగళవారం ఉదయం జరిగే రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి సీతక్క రానున్నారని అన్నారు. మండల వ్యాప్తంగా లబ్ధిదారులు 1,299 మంది ఉన్నారని తెలిపారు.

- మంగపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి సీతక్క మంగళవారంపర్యటించనున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి తెలిపారు. మంగపేటలో రైతు సేవా సహకార సంఘం ద్వారా నిర్మించిన గోదాం సముదాయాన్ని, రాజుపేటలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని మంత్రి ప్రారంభించనున్నారని వివరించారు. రైతు సేవా సహకార సంఘం సభ్యులు, కాంగ్రెస్ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జయరాంరెడ్డి కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తాడ్వాయి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ములుగు మార్కెట్ చైర్‌పర్సన్ రేగ కల్యాణి పలు అభివృద్ధి పనులను సోమవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామంలో రూ. 10లక్షల పంచాయతీరాజ్ నిధులతో సీసీ రోడ్ పనులు, రూ. 10లక్షలతో గౌడ సంఘం వారి ఎల్లమ్మ గుడి ప్రాకారం పనులు, రూ. 10లక్షలతో పద్మశాలి సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు పాలకుర్తి మధు, కోడి సతీష్, శనిగరం చిరంజీవి, తడక రమేష్, ఎండీ మూజాఫర్, పల్నాటి సత్యం, కూచన సురేష్, కందకట్ల సాంబయ్య, వంగరి సదనందం, నేతాని రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భూపతిపూర్‌లో వైద్య శిబిరం

కన్నాయిగూడెం జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల అటవీ గిరిజన గ్రామమైన భూపతిపూర్‌లో వనవాసి కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అశోక్, జగదీశ్, కన్నాయిగూడెం మార్కెట్ కమిటీ అధ్యక్షుడు చర్ప పగిడయ్య, మాజీ ఎంపీటీసీ ఆలం నర్సక్క, రాంబాబు, మాజీ సర్పంచ్ చర్ప కమల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మంగపేటలో పర్యటించిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి

మంగపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుంజా సూర్య సోమవార పర్యటించారు. అకినేపల్లి మల్లారంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాశిరెడ్డి సాంబశివరెడ్డి జన్మదిన వేడుకలో పాల్గొన్నారు. బ్రాహ్మణపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్‌టీఐ చైర్మన్ బండ జగన్‌మోహన్‌రెడ్డిని పరామర్శించారు. అదే గ్రామంలో జ్వరంతో బాధపడుతూ మృతి చెందిన మద్దెల లక్ష్మి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం కత్తిగూడెం, రాజుపేట, రామచంద్రునిపేట, రమణక్కపేట, వాడగూడెం, చుంచుపల్లి, మల్లూరు, కొత్తమల్లూరు, బోరునర్సాపురం, మంగపేట, కమలాపురంలో జరిగి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు


ఖర్గే జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ శ్రేణులు

టేకుమట్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలంగా పని చేస్తూ పార్టీ బలోపేతం కోసం పని చేస్తున్న నాయకుడు ఖర్గే అని సతీష్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దొంతుల శ్రీనివాస్, కత్తి సంపత్, బండ శ్రీకాంత్, వైనాల రవీందర్, వంగ నరేష్, నాంపెల్లి వీరేశం, వివిధ గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు 6 వేల ఫెన్షన్ ఇవ్వాలి

మల్హర్, జూలై 21(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 6 వేల పెన్షన్ అందించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల అధ్యక్షుడు కేశారపు నరేష్ డిమాండ్ చేశారు. తాడిచర్లలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ భూపాలపల్లికి రానున్నారని తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతవులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడిగా శశిధర్‌రావు



కాటారం, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వాల శశిధర్ రావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల పరిశీలకుడు కొట్టె శ్రీశైలం తెలిపారు. పాఠశాలల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని శశిధర్‌రావు తెలిపారు. త్వరలో పూర్తిస్థాయి కమిటీ నియామకం చేస్తామని శ్రీశైలం వెల్లడించారు.

ఘనంగా బోనాల సంబరాలు


గంగారంలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

కాటారం, జూలై21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం, దేవరాంపల్లి తదితర గ్రామాల్లో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర సోమవారం ఘనంగా జరిగింది. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య కుటుంబ సభ్యులతో కలిసి మహిళలు బోనాలను ఎత్తుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో పలు కుల సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ములుగులో కంటి వైద్య శిబిరం

ములుగుటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలో కంటి వైద్య శిబిరాన్ని బీఆర్ఎస్ నాయకుడు భూక్య జంపన్న ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి పైగా పలు మండలాల ప్రజలు పరీక్షలు చేయించుకున్నారు. కాగా 45మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు సూచించారు. వీరికి తన సొంత ఖర్చులతో కంటి వైద్యం చేయిస్తానని జంపన్న తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

చిట్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్‌కు చెందిన కారోబార్ జిల్లెల కుమారస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మొగుళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అతడితో కలిసి చదివిన మిత్రులు బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. రూ.25 వేలు ఆర్థిక చేయూతను అందించారు. పరామర్శించిన వారిలో బండారి సదయ్య, కంటి రమేష్, వెల్దండి వెంకటేశ్వర్లు ఉన్నారు.

కొత్తగూడలో ఆదివాసీల బంద్ ప్రశాంతం

కొత్తగూడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో జీ వో నెంబర్ 49ని వ్యతిరేకిస్తూ ఆదివాసీలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఏజెన్సీ బంద్ కొత్తగూడలో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు ఆగబోయిన రవి, మల్లెల రాము, జిల్లా అధ్యక్షుడు కుంజ నర్సింగరావు, పూనెం సందీప్‌కుమార్, మల్లెల సారయ్య, ఈక విజయ్, ఈసం రామస్వామి, లక్ష్మీనర్సు, జీవన్, మోకాళ్ల సుధీర్, ఈక వెంకట్, లక్ష్మీనారాయణ, శ్రీను, బాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రులల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, వాకాటి శ్రీహరి, ఉన్నతాధికారులతో కలిసి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్లతో మాట్లాడారు. భూపాలపల్లి నుంచి ఆ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు నుంచి ఆ జిల్లా కలెక్టర్ దివాకర పాల్గొన్నారు. వానాకాలం పంటల సాగు, రేషన్‌కార్డుల పంపిణీపై సమీక్షించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిరంతర వైద్యసేవలపై కలెక్టర్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ సాగు పనులు సజావుగా జరిగేందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. యూరియాను వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల కొరతపై రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు జిల్లాల్లో టోల్‌ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పిడుగుపాటు మరణాలు సంభవిస్తున్నాయని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వర్షాలు వచ్చినప్పుడు చెట్లకింద, స్తంభాల దగ్గర ఉండకుండా చూడాలన్నారు. పిడుగుపాటుతో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని, దీని కోసం పోలీస్ అధికారులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అన్నారు. వర్షపు నీరు వృథాగా పోకుండ వడిసిపట్టి సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నూతన రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని, 25నుంచి ఆగస్టు 10వరకు మండలకేంద్రాల్లో రేషన్‌కార్డులను పంపిణీ చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో భూపాలపల్లి అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్, జీజీహెచ్ సూరింటెండెంట్ నవీన్ కుమార్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శ్రీదేవి, ములుగు ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు రాహుల్ శర్మ, దివాకర

కొత్తపల్లిగోరి పోలీస్‌స్టేషన్ ప్రారంభం


ఎస్సై దివ్యను కుర్చీలో కూర్చొబెడుతున్న మంత్రులు

రేగొండ, జూలై 21(ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో తాత్కాలిక పోలీస్‌స్టేషన్‌ను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం ప్రారంభించారు. మంత్రులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. రిబ్బన్ కట్ చేసి పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రులు ఎస్సై దివ్యను కుర్చీలో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ ప్రారంభంలోనే వర్షం వస్తోందని, ఇది రైతులకు శుభ సూచికమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కృషి చేస్తున్నారని అన్నారు. ఆయన కోరిన విధంగా అభివృద్ధి పనులకు సహకరిస్తామని అన్నారు.

సాగు భూముల సమస్య పరిష్కరించాలి

-ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

వందేళ్లుగా రైతులు సాగు చేసుకుంటున్నా పట్టాకు నోచుకోని సర్వే నెంబరు 391, గోరిసాట్ భూముల సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ కోరారు. గత ప్రభుత్వంలో పాలకులకు దోచుకోవడమే సరిపోయిందన్నారు అప్పటి ఇసుక దొంగలే నేడు ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం నూతన మండలం ఏర్పాటు చేసి వదిలేస్తే తాను మంత్రుల సహాయంతో తహసీల్దార్, ఎంపీడీవో భవనాలు మంజూరు చేయించి నిర్మిస్తున్నానన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జాయింట్ కలెక్టర్ అశోక్‌కుమార్, డీఎస్పీ సంపత్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నర్సయ్య, నాయకులు మోడెం ఉమేష్‌గౌడ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, మేకల భిక్షపతి, ముద్దనపల్లి శంకరయ్య, వీరబ్రహ్మం, మొట్టె కిరణ్, కోయిన క్రాంతి పాల్గొన్నారు.

అన్నదాతల్లో చిగురించిన ఆశలు

(5వ పేజీ తరువాయి)

కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది.

విస్తరించిన వర్షాలు

వర్షాలు ఆదివారం నుంచి జిల్లా అంతటా విస్తరించాయి. లోటు వర్షపాతం ఉన్న జిల్లాలో సోమవారం ఉదయం నుంచి కొత్తగూడ, నర్సింహులపేట, గూడూరు, నెల్లికుదురు, కేసముద్రం, పెద్దవంగర, ఇనుగుర్తి మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. కొత్తగూడ మండలంలో మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. గార్ల, డోర్నకల్, బయ్యారం, మహబూబాబాద్, సీ రోలు, మరిపెడ, తొర్రూరు మండలాల్లో 15 నిమిషాల పాటు ఒక్కసారి జల్లులు కురిసి ఆగిపోయాయి. కొన్ని మండలాల్లో ముసురు అలుముకుంది.


పేదోళ్ల కలలు సాకారం చేస్తాం

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ ఇస్తుందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువతకు ఉపాధి కల్పనలో అండగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పమని అన్నారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ తదితర విద్యను అభ్యసించిన నిరుద్యోగ యువతకు స్కిల్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ కొత్తపల్లిగోరి, టేకుమట్లలో రూ. 6 కోట్లతో ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇందులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఏళ్ల తరబడి భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు రాక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వారందరికీ ప్రభుత్వం భూ భారతి చట్టం ద్వారా పట్టాలు జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాకు బైపాస్ రోడ్డు, మైనింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని మంత్రులను కోరారు. డీబీఎం 38కాల్వకు రూ. 320 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐతా ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటా రాజబాపు, ఆర్టీసీ అధికారులు సలోమం, విజయభాను, ఇందు, సింగిల్ విండో చైర్మన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన గ్రంథాలయ చైర్మన్ రవిచందర్


రోగులతో మాట్లాడుతున్న బానోత్ రవిచందర్

ములుగుటౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ సందర్శించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులను మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ ములుగు మండల అధ్యక్షుడు ఎం.డి.చాంద్ పాషా, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, ఉపాధ్యక్షుడు జక్కుల రేవత్ యాదవ్, మాజీ ఎంపీటీసీ మాపురపు తిరుపతిరెడ్డి ఉన్నారు.